మినీ కథ:

# ఆకలి-ఆడది



టి.వి.శ్రీరంగారావు

గుంటూరు బస్టాండులో ఓసారి అడుగు పెట్టిన వాళ్ళకయినా సరే గుర్తుండి పోతుంది రెండు జళ్ళూ, నంగిరిమాటా, లంగా ఓణీ వేసుకున్న ఓ ఆకారం. అది ఆడది. ఇంచుమించు పదేళ్ళనుంచి చూస్తున్నాను. గౌన్లేసుకుని బస్సుల్లోకి వచ్చి అడుక్కుంటూ ఉండేది. జడలు ఒక్కోసారి శుభ్రంగా దువ్వి ఉండేవి. ఒక్కోసారి చింపిరి చింపిరిగా ఉండేవి. క్రమంగా అలవాటుపడిపోయాను నేను. తరచు ప్రయాణాలు చేస్తూ ఉండటంతో ఆ పిల్ల ఏనాడేనా రాకపోతే విచిత్రంగానూ, ఏదో లోపంగానూ ఉండేది.

మూడేళ్ళనాడు ఎత్తుగా వున్న పొట్టతో కనిపించింది. రూపంలో తేడాయేగానీ ఏమాత్రం మార్పులేదు. చెయ్యిచాచి అలా నిలబడి ఏదో వాగుతుంది. వేసినవాళ్ళు వేస్తారు. వెయ్యనివాళ్ళు వెయ్యరు.

ఆ తరువాత ఆ పొట్ట తగ్గిపోయింది. మళ్ళీ నడికట్టూ, తలకి గుడ్డా ఆ రూపానికి అదనంగా చేరాయి. ఆ తరువాత కొన్నాళ్ళకి పొట్ట పెరిగింది. మళ్ళీ నడికట్టూ, తలకి గుడ్డా.

ఆ హడావుడిలో ఆ పిల్లకి సంపూర్ణ స్త్రీత్వం ఎప్పుడు వచ్చిందో వచ్చేసింది. చక్కని శరీరం, మంచి సొంపుసొంపులు. వీటితోపాటు శుభ్రం కూడా. మరి వీటన్నింటి వెనకా ఎవరేనా వున్నారో లేరో మనకి అర్ధం కాదు. ఆ పిల్ల అడుక్కోడానికి మాత్రం ఒక్కర్తే వస్తుంది.

నాలాగా ఆ పిల్లని పరిశీలిస్తున్నవాళ్ళు ఇంకా ఉండే వుంటారు. ఆ అమ్మాయి అడుక్కోడానికి వచ్చినప్పుడల్లా —

"మాయరోగవా! ఇలా అడుక్కుంటూ పందిలాగా పిల్లల్ని కనకపోతే ఏం! ఈ పిచ్చిముండకి కూడా మొగుడుకావాల్సొచ్చే."

"ప్చ్! ఏవిటో! అయినా గవర్నమెంటు ననాలి. ఈ అడ్డమైన గతిలేని వాళ్ళనీ వదిలేసి మనబోటి వాళ్ళకి పెడుతోంది ఈ ఫామిలీ ప్లానింగు. వీళ్ళని కోయించాలి ముందు."

"అయినా దీనికి ఆ పని చేసే వెధవెవడండీ! అంత కక్కుర్తి పక్షి!" నవ్వులు.

ఆ పిచ్చిముండ నిస్సహాయత్వం మీదా, దాన్ని ఆధారంగా చేసుకుని అనుభవించిన మగతనం మీదా జోక్ చేసి ఆనందించే మానవత్వం.

ఆ పిల్లకి మాత్రం తెలిసింది ఒక్కటే. అది ఆకలి. అది తీరాలంటే అడుక్కోవాలి.

చంకలో పిల్ల. కడుపులో మరో పిల్ల.

వచ్చిన ప్రతి బస్సూ ఎక్కా, దిగా.

ఎవరో ఏదో అనడం. ఫక్కుమని అందరూ నవ్వడం. దానికి ఏమీ అర్థం కావడంలేదు. అసలర్ధంకాదు. ఆమె భాష వేరు. ఆ లోకం వేరు.

ఎందుకు వీళ్ళంతా నవ్వుతున్నారనే సందేహం రాదు. వాళ్ళు నవ్వుతున్నారు. అంతే ఆమె కూడా నవ్వుతుంది. అసంకల్పితం.

ఓ పైసా వేస్తే తీసుకుంటుంది. లేకుంటే లేదు. ఈ ఆకలి భూమ్మీద పడ్డనాటినుంచే మొదలు. మరి....

వికసించిన స్త్రీత్వంతోపాటు మేథ కూడా పెరిగితే ఆమెకు తన హైన్యత దైన్యత అర్ధం అయేవి.

మేథ ఎదగని ఆమెకు అన్నీ వున్నాయి.

ఆకలి, దప్పిక....

చీకటి పడుతుంది. చుట్టూ నిశ్శబ్దం పేరుకుంటుంది.

మొజాయిక్ ఫ్లోరింగూ, ఎయిర్ కండిషన్ బెడ్‌రూమూ, ఫోమ్ పరుపులకీ చీకటి పడుతుంది. చుట్టూ నిశ్శబ్దం పేరుకుంటుంది.

రోడ్డు వారన టీ బంకు కిందకూడా చీకటే. అదే ఆ నిశ్శబ్దమే.

సరిగ్గా ఆ చీకట్లోనే ఆ నిశ్శబ్దంలోనే రేగుతుంది మరో ఆకలి. ఇదికూడా ఆ ఆకలంత పవర్‌ఫుల్లే.

అప్పుడే ఏవో స్పర్శలు, అసంకల్పిత ప్రతీకార చర్యలు.

ఎవరికైనా, ఎక్కడైనా అవే అవే చర్యలు.

ఆకలి అడుక్కోమంటుంది.

ఆకలి అల్లరి పెడుతుంది.

ఆ ఆకలికీ, ఈ ఆకలికీ అందరూ గురవుతారు.

రెండింటికీ ప్రేరణ ప్రకృతే.

అయితే ఈ రెండింటికీ రుజువుగానూ, ముద్దాయిగానూ నిలబడేది ఆడదే. ఆడది.

అవును ఆడది.

